

బీఆర్‌ఎస్ పాలనలో ప్రజల ఆకాంక్షలు నిర్వీర్యం 7లో..
గ్రామాల్లో బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేకాధికారులు 8లో..

తప్పని ఎదురు చూపులు

- వేతనాల కోసం మెప్మా ఆర్పీల నిరీక్షణ
- ఏడు నెలలు గడుస్తున్నా అందని వైనం
- పెంచుతున్నట్లు ప్రకటించిన గత ప్రభుత్వం



జగిత్యాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మిషన్ ఫర్ ఎలిమినేషన్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరియాస్) మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీ (రిసోర్స్ పర్సన్లు) లు వేతనాలు సక్రమంగా అందక విలవిల్లాడుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న అరకొర వేతనాలతో కుటుంబ ఆర్థిక అవసరాలను తీర్చుకోలేక అవస్థల పాలవుతు న్నారు. ఎటువంటి ఇతర ఆర్థిక భరోసా లేక కుటుంబ నిర్వహణ భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం వీరి వేతనాన్ని పెంచుతామంటూ నిర్ణయం తీసుకున్న తర్వాతే నిలిచిపోవడం గమనార్హం. అంతకు ముందు ప్రతినెలా క్రమం తప్పకుండా రాగా ప్రభుత్వం ప్రకటించిన విధంగా మరుసటి నెల నుంచి పెరిగిన జీతంతో ఖాతాల్లో జమ చేస్తారని ఆశతో ఎదురు చూడగా... ఏడు నెలలైనా వేతనాలు అందలేదు.

జిల్లాలో 167 మంది మెప్మా ఆర్పీలు...

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో కలిపి 167 మంది మెప్మా రిసోర్స్ పర్సన్‌లున్నారు. ఇందులో జగిత్యాల మున్సిపాలిటీలో 57 మంది, కోరుట్లలో 49 మంది, మెట్‌పల్లిలో 33 మంది, రాయికల్‌లో 16 మంది, ధర్మపురి ము న్సిపాలిటీలో 12 మంది మెప్మా రిసోర్స్ పర్సన్‌లు పనిచేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 5,244 స్వయం సహాయక మహిళా సంఘాలున్నాయి. ఇందులో జగిత్యాల మున్సిపల్‌లో 2,100, కోరుట్లలో 1,345, మెట్‌పల్లిలో 1,260, రాయికల్‌లో 282, ధర్మపురిలో 257 మహిళా సంఘాలున్నాయి. సుమారు 80 వేల మంది మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు.

మహిళాభివృద్ధిలో కీలక పాత్ర...

మున్సిపాలిటీ పరిధిలోని మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఆయా కాలనీల్లో ఆర్పీల విధులు సంఘాలు ఏర్పాటు చేస్తారు. అవసరం మేరకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తూ...వారి చిరు వ్యా పారాలకు భరోసా కల్పించేలా ప్రోత్సహిస్తారు. 25 సంఘాలకు ఒక సమాఖ్య ఉంటుంది. దీనికి ఆర్పీ బాధ్యురాలిగా ఉంటారు. గ్రూపుల మహిళలకు స్త్రీ నిధి ద్వారా రుణాలిప్పించడం, రికవరీ చేయించడం ప్రతి నెలా గ్రూపుల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి మహిళా సాధికారత అభివృద్ధి కార్యక్రమాలపై ఆర్పీలు మహిళలకు అవగాహన కల్పిస్తారు. ఇందు కోసం ప్రతినెలా గౌరవ వేతనంగా రూ. 4 వేలు ప్రభుత్వం అందిస్తుంది.

పెరిగిన వేతనం వచ్చేనా...?

2018 సంవత్సరం నుంచి ఆర్పీలకు గౌరవ వేతనంగా రూ. 4 వేలు ప్రభుత్వం అందజేస్తుంది. వీరి కృషిని గుర్తించి 2023 అక్టోబర్‌లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో నంబరు 756 ద్వారా మరో రూ.2 వేలు పెంచుతూ మొత్తం 6వేలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది జూలై నుంచి ఇప్పటి వరకు పాత, కొత్త వేతనాలు జమ కాకపోవడంతో ఆర్పీలు అప్పులు చేస్తూ కాలం వెల్ల దీస్తున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ మైనా పెరిగిన వేతనాలు అమలు చేస్తూ... ప్రతి నెలా క్రమం తప్పకుండా అందించాలని కోరుతున్నారు.

అదనపు బాధ్యతలతో భారం...

మెప్మా ఆర్‌పీలకు అదనపు బాధ్యతలు భారంగా మారుతున్నాయి. పట్టణాల్లో స్వయం సహాయక మహిళా సంఘాల ఏర్పాటు, వాటి బలో పేత, రుణాలు ఇప్పించడం, సకాలంలో రుణాలు చెల్లించేలా ప్రయత్నాలు చేయడం, పొదుపు పాటింపజేయడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, నిర్ణీత గడువుల్లో మహిళా సంఘాల సమావేశాలు, వార్డు స మాఖ్య సమావేశాలు నిర్వహించి పలు తీర్మానా లు చేయించడం వంటివి చేస్తుంటారు. వీటికి తోడు క్షేత్ర స్థాయిలో సర్వేలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమా ల్లో రిసోర్స్ పర్సన్‌లు విధులు నిర్వహిస్తున్నారు. పొద్దస్తమానం కష్టపడ్డ అరకొర వేతనాలు అంది స్తుండడంతో నిరాశకు గురవుతున్నారు. ఇప్ప టికైనా ప్రభుత్వం మెప్మా రిసోర్స్ పర్సన్‌లకు నెలకు రూ. 15 వేతనం అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజా పాలన విధులు..

రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పథకాలను ప్రవేశపెట్టింది. ఆ పథకాలకోసం గ్రామాల్లో వీవోఏలు, మున్సిపాలిటీల్లో ఆ ర్పీలు అర్హులైన కుటుంబాలనుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులు పూర్తి చేయడం, వారికి పథకాలపై అవగాహన కల్పించడం లాంటి పనులు చేశారు. గత ఎన్నికల్లో బీఎల్‌వోలుగా విధులు నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కొత్త ఓటరుగా ఓటు నమోదు చేయించారు.

కనీస వేతనం అందించాలి

ఎం అనిత, మెప్మా ఆర్‌పీల సంఘం జిల్లా నాయకురాలు



గత ఏడాది జూలై నుంచి వేతనాలు రావడం లేదు. దీంతో అప్పులు చేసి కాలం వెళ్ల దీయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆర్పీల కనీస వేతనం రూ. 18 వేలకు పెంచి, నేరుగా ఆర్పీల ఖాతాల్లో జమ చేయాలి. ఆర్‌పీల వేతనాలు పెండింగ్‌లో ఉండకుం డా చర్యలు తీసుకోవాలి. ఏ నెలకు ఆ నెల వేత నాలను అందించాలి.

ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్తాం..

శ్రీనివాస్, జిల్లా మెప్మా ఏవో, జగిత్యాల



మెప్మా ఆర్‌పీలకు పనిబారం ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం అందిస్తున్న గౌరవ వేతనం సరిపోవడం లేదని ఆర్‌పీలు విన్నవిస్తు న్నారు. దీనికి తోడు గత ప్రభుత్వం పెంచిన వేతనాలు ఇప్పించాలని కోరుతూ ఇటీవల వినతి పత్రం సమర్పించారు. మెప్మా ఆర్‌పీల వేతనాల పరిస్థితిని ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్తాము. ప్రభుత్వ నిర్ణయం మేరకు వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటాము.

జీవో నం 55ను వెంటనే వెనక్కి తీసుకోవాలి

ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యులు సాయి



పొలాస కళాశాలలో ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు, అగ్రికల్చర్‌విద్యార్థులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 2: హైదరాబాద్‌లోని వ్యవసాయ ఉద్యాన వర్సిటీ భూములను హైకోర్టు ఏర్పాటుకు కేటాయించిన జీవో నెం 55ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యులు రాపాక సాయి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీరు, నిర్ణయాన్ని వ్యతిరే కిస్తూ జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలోగల వ్యవసాయ కళాశాల, పొలాస ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో నాయకులు విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ హైకోర్టు భవన నిర్మాణానికి స్థలం కేటాయించడం అంటే వ్యవసాయ రంగ అభివృద్ధికి అడ్డుకట్ట వేయడమేనని అన్నారు. నెల రోజులుగా యూనివర్సిటీ ఎదుట భూముల పరిరక్షణకు ఏబీవీపీ రాష్ట్ర నాయకత్వం రాజీలేని పోరాటం చేస్తుందని, జీవో నెం 55ను నిరసిస్తూ ఉద్యమించిన రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీపై పోలీసులు క్రూరంగా వ్యవహరించిన తీరు రాష్ట్ర ప్రభుత్వ దుర్మార్గకరమైన పాలనకు నిదర్శనం అన్నారు. ఈ ఘటనకు కారకులైన కానిస్టేబుల్‌లను వెంటనే చర్యలు తీసుకోవాలని, అలాగే భూముల కేటాయింపు జీవోను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మనువాడ నందు, నీరటి మనోహర్, జోనల్ ఇన్‌చార్జి ప్రశాంత్, జస్వంత్, రంజిత్, శివాజీతో పాటు వ్యవసాయ కళాశాల విద్యార్థులున్నారు.

రెండో రోజు ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 2: ఇంటర్ ద్వితీయ సంవత్సర జనరల్, వొకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు గురువారం నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయని ఇంటర్మీడియేట్ నోడల్ అధికారి, పరీక్షల కన్వీనర్ నారాయణ తెలిపారు.. రెండో రోజు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 92శాతం విద్యార్థులు హాజరవగా, ప్రశాంతగా రెండో రోజు పరీక్ష ముగిసిందన్నారు. జనరల్ విభాగంలో 775 విద్యార్థులకు గానూ, 761మంది విద్యార్థులు హాజరవగా 14 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. వొకేషనల్ విభాగంలో 724 మంది విద్యార్థులకు గానూ 606 మంది హాజరవగా, 118 గైర్హాజరైనారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో జనరల్ విభాగంలో 342 మందికి గానూ 333 హాజరవగా, 9 మంది గైర్హాజరయ్యారని, వొకేషనల్‌లో 814 విద్యార్థులకు గానూ 730 మంది హాజరుకాగా, 84 మంది గైర్హాజరైనట్లు కన్వీనర్ నారాయణ తెలిపారు.

మసీదుల వద్ద సౌకర్యాలను సమకూర్చాలి

రాయికల్, ఫిబ్రవరి 2: రాయికల్ పట్టణంలోని మసీదుల వద్ద కావాల్సిన సౌకర్యాలను సమకూర్చాలని ముస్లిం సెంట్రల్ కమిటీ నాయకులు మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లును శుక్రవారం కోరారు. నూతనంగా ఎన్నుకోబడిన సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు సోహైల్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, ఎస్సై అజయ్, తహసీల్దార్ ఖయ్యూంలను సన్మానించారు. ముస్లీం సెంట్రల్ కమిటీ చేపడుతున్న అభివృద్ధి పనులకు తమవంతు సహాయ సహకారాలు అందించాలని, రాబోయే రంజాన్ నెల సందర్భంగా మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్ల చేయాలని, మైనార్టీ ముస్లీంలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని అధికారులను కోరారు. ముస్లిం సెంట్రల్ కమిటీ సభ్యులు ఎంఏ ముజాహిద్, అబ్దుల్ నయీం, షేక్ హుస్సేన్, అబ్దుల్ రషీద్, మహ్మద్ సబీల్, షాకీర్, మున్నా, అన్సార్, మెహసీన్ బాబా, అబ్దుల్ అతీక్ పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పశువైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, రైతులు

సారంగాపూర్, ఫిబ్రవరి, 2 : రైతులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుట్ల పశు వైద్య కళాశాల అసోసియేట్ డీన్ తక్కల్లపల్లి మాదవరావు అన్నారు. శుక్రవారం పీవీ నర్సింహరావు తెలంగాణ పశువైద్య విశ్వ విద్యాలయం కోరుట్ల, జగిత్యాల పశు సంవర్ధక శాక సహకారంతో జీతీయ సేవా పథకంలో బాగంగా మండలంలోని పోచంపేట, అర్పపల్లి, రేచపల్లి, గ్రామాల్లో పశువైద్య శిబిరాలను నిర్వహించారు. 210 పశువులకు గర్భకోశ చికిత్సలను, 110 మెడిసిన్ చికిత్సలను చేశారు. ఈ సందర్భంగా పశువులకు వచ్చే వ్యాధులు నివారణ మార్గాలు, నూతన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాదికారి డాక్టరు రాజేందర్‌రెడ్డి, ఎన్‌ఎస్ఎస్ పోగ్రం అధికారి డాక్టరు అంబిక, వైద్యులు పరశరాములు, సురేష్, తిరపతి గౌడ్, రవీందర్, సునీల్, కళాశాల అధ్యాపకులు డాక్టరు కృష్ణ చైదా, శ్రీ దేవి, సుష్మ, జగన్‌మోహన్‌రెడ్డి, విశాల్, ప్రియంక, అనిత, రాజ వర్ధణ్, 67 మంది విద్యార్థులు, రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

మల్యాల, ఫిబ్రవరి 2: మండలంలోని మ్యాడంపల్లికి చెందిన జనుప అక్షిత అనే విద్యార్థిని, లంబాడిపల్లికి చెందిన మాజీ సర్పంచ్ గంగుల హన్మవ్వ ఇటీవల మృతి చెందగా మృతుల కుటుంబసభ్యులను ఎమ్మెల్యే మేడపల్లి సత్యం పరామర్శించారు. వారి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు ఆనందరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ముత్యం శంకర్, నేరెళ్ల సతీష్‌రెడ్డి, సంత ప్రకాష్‌రెడ్డి, కట్కం వినయ్ తదితరులు ఉన్నారు

స్కాలర్‌షిప్ దరఖాస్తుకు గడువు పెంపు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 02: 2023-24 విద్యా సంవత్సరానికి గానూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యారులు కాలేజీలలో ఆన్‌లైన్ స్కాలర్‌షిప్‌లు దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 31 వరకు గడువు పెంచినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ అన్నారు. ప్రిన్సిపాల్స్ విద్యార్థులకు తెలియజేయాలని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు ఈ పాస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయాలని వినతి

రాయికల్, ఫిబ్రవరి 2: రాయికల్ పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న హనుమాన్ ఆలయం ఎదుట, వీరాపూర్ రోడ్డులోని ఫకీర్ కాలనీ దగ్గర విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయాలని కోరుతూ కమిషనర్ సంతోష్ కుమార్‌కు పట్టణ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, ఎద్దండి దివాకర్, మున్నాబాయ్, నర్సయ్య, నరేష్, గంగాధర్, రాజేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రణాళికతో విద్య,వైద్య రంగాలను అభివృద్ధి చేయాలి

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

ధర్మపురి, ఫిబ్రవరి 2: ప్రణాళికతో విద్య, వైద్య రంగాలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ సూచించారు. ధర్మపురి పట్టణంలోని ఎస్ఎల్ఎన్ గార్డెన్స్‌లో శుక్ర వారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ వైద్య రంగంలో సేవలు అందించడంలో అధికారులు, సిబ్బంది ముందు ఉండాలని అన్నారు. టైమ్ లైన్ ప్రకారం వైద్య ఆరోగ్య శాఖ పక్షాన వైద్యులు, సిబ్బంది కార్యక్రమాలు చేపట్టి సక్సెస్ చేసేందుకు దృష్టి సారించాలని ఆయన అన్నారు. వైద్య కళాశాలలు, ఆసుపత్రుల్లో ప్రమాణాలు ఉన్నప్పటికి వ్యవస్థ లేదని ఆయన పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో మెరుగైన వసతులు, సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. అలాగే పలు సమస్యల గురించి ఆయన చర్చించారు. అంతకు ముందు కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా, జిల్లా అదనపు కలెక్టర్లు దివాకర, బీఎస్ లత మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్‌భాషా, జిల్లా అదనపు కలెక్టర్లు, జగిత్యాల ఆర్‌డీవో నరసింహ మూర్తి, డీఎంహెచ్‌వో డాక్టర్ పుప్పాల శ్రీధర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీని వాస్, డీసీహెచ్ఎస్ డాక్టర్ సుదక్షిణాదేవి, ఎంసీ సూపరింటెండెంట్ డాక్టర్ ఖాద్రీ, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సమియొద్దీన్, డాక్టర్ శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్స్ పాల్గొన్నారు.



కలెక్టర్, అదనపు కలెక్టర్‌లతో మాట్లాడుతున్న మంత్రి

అభివృద్ధి పనుల్లో గెజిటెడ్ అధికారుల పాత్ర కీలకం

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



కలెక్టర్ యాస్మిన్ భాషాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గెజిటెడ్ అధికారులు

జగిత్యాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల్లో గెజిటెడ్ అధికారుల పాత్ర కీలకంగా ఉంటుందని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో టీజీవో ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఆమె ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్‌గా సంవత్సర పదవీ కాలాన్ని పూర్తి చేసుకోవడాన్ని స్వాగతిస్తూ పలువురు గెజిటెడ్ అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లా అభివృద్ధికి అధికారులు పునరంకింత మై పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీజీవో అధ్యక్షుడు గంగుల సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి మామిడి రమేష్, సహ అధ్యక్షుడు రవి బాబు, నాయకులు రాజేందర్‌రెడ్డి, విజేందర్, లావణ్య, ప్రవీణ్, వంశీ కృష్ణ, హనుమంతరావు, వెంకటరమణ, రాజ మనోహర్, అంజిత్ రెడ్డి పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాల బారిన పడకుండా నిరోధించాలి

యువత మత్తు పదార్థాల బారిన పడకుండా ప్రాథమిక స్థాయిలోనే నిరోధించాలని కలెక్టర్‌షేక్ యాస్మిన్ బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్‌పీ సన్‌ప్రీత్ సింగ్‌తో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలోని యువత డ్రగ్స్ బారిన పడకుండా అన్ని శాఖల అధికారుల భాగస్వామ్యంతో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాల, కళాశాలల్లో ఆంటి డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పీ ప్రభాకర్‌రావు, డీఎస్‌పీ వెంకటస్వామి, వెంకటేశ్వర్‌రావు, ఆర్‌డీవోలు రాజేశ్వర్, మధు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గావ్ చలో.. బస్తీ చలో విజయవంతం చేయాలి

మల్యాల, ఫిబ్రవరి 2: గ్రామాల్లో గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమంను విజయవంతం చేయాలని కార్యక్రమ జిల్లా కోకన్వీనర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు పార్టీ శ్రేణులను కోరారు. మల్యాలలో శుక్రవారం గావ్ చలో.. బస్తీ చలో అభియాన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ ఈ కార్యక్రమం కోసం నియమించిన ప్రవాసి సంయోజకులు మంగళవారం నుంచి శుక్రవారం వరకు తమకు కేటాయించిన గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి మరో సారి ప్రధానిగా మోదీకి మద్దతు తెలపాలని కోరాలని తర్వాత అక్కడే నిద్రించాలని అన్నారు. ఇందుకు పార్టీ కార్యకర్తలు చురుగ్గా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు నెరెళ్ల శ్రావన్, మండల కన్వీనర్ గౌతమ్, కోకన్వీనర్ బండారి రాజు, గాజుల మల్లేశం, కట్కం లత, రమ, గాండ్ల శ్రీనివాస్, గవాస్కర్, యుకుందు గంగాధర్, పన్నాటి మల్లేశం, అంజి,నాగరాజ్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అభినందనల వెల్లువ

జగిత్యాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌గా షేక్ యాస్మిన్ బాషా సంవత్సర పదవీ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకోవడానికి స్వాగతిస్తూ శుక్రవారం పలువురు అధికారులు ఉద్యోగులు వెల్లువల అభినందలు తెలిపారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలో కలెక్టర్‌ను పలువురు అధికారులు, ఉద్యోగులు వేర్వేరు సందర్భాల్లో కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, జిల్లా రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు వకీలు, జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు గంగుల సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

జగిత్యాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని ఆడిటోరియంలో నీటి సరాఫరా, మిషన్ భగీరథ, మండల పంచాయతీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎండాకాలంలో ప్రజలకు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన విధంగా నిరంతర తాగునీరు సరాఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవరాజు, అయా ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ సమయంలో పోరాడిన వారికి గుర్తింపు

త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 2: ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎమర్జెన్సీ సమ యంలో అప్పటి ప్రభుత్వంతో పోరాడినవారికి గుర్తింపు ఉంటుందని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. జగిత్యాలలో భారత సురక్షా సమితి జిల్లా శాఖ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఇంద్రసే నారెడ్డిని సన్మానించారు. ఈ సందర్భం గా ముఖ్య అతిథిగా హాజరైన ఇంద్రసేనా రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమర్జెన్సీ పోరాటంలో పాల్గొని ప్రాణత్యాగం చేసిన అమరులకు, వయోభారంతో మృతి చెందిన సభ్యుల ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గవర్న ర్‌గా బాధ్యతలు తీసుకున్నాక, ఎన్నికల హడావిడి నేపథ్యంలో ఎవరినీ కలవ లేకపోయానన్నారు. ఏ పదవిలో ఉన్న తన సహచరులను మర్చి పోకుండా ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. ఎమర్జెన్సీ పోరాటంలో భాగంగా లాఠీ ఛార్జీ అయిన, అరెస్టయిన ముందుండి పోరాడిన అశోక్ కుమార్ దాదా పోరాటం స్ఫూర్తిదాయకం అన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక సమర యోధులుగా గుర్తించి గౌరవిం చినట్లు గానే, ఎమర్జెన్సీ పోరాటయోధులను గుర్తించాలనే తలంపుతో ఆనాటి యోధులు ఉన్నారన్నారు. ఇప్పటికే గుర్తింపు కోసం పోరాటం చేసి కొన్ని ప్రాంతాల్లో గుర్తింపు సాధించా మని, ఇందులో భాగంగానే మన రాష్ట్రంతో పాటు ఇతర ప్రాంతాల్లో ఇలాంటి గుర్తింపు కోసం అశోక్ కుమార్ నాయకత్వంలో ఈ భారత సు రక్ష సమితి ఆవిర్భవించిందన్నారు. 1962లో ఆర్ఎస్ఎస్‌లో ఆరంగ్రేటం నుంచి నేటి గవర్నర్ వరకు అనేక పదవులు, హోదాలు అను భవించా నని, వివిధ హోదాల్లో పని చేసిన తనను గుర్తించి గవర్నర్‌గా నియ మించిన ప్రధాని నరేంద్రమోదీకి ఇంద్ర సేనా రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. గవర్నర్ అంటే హోదా కాదని బాధ్యత అన్నారు. త్రిపుర లాంటి రాష్ట్రం అక్షరాస్యతలో ముందున్నా కొన్ని సాంఘిక దురాచారాలు ఉన్నా యన్నారు. ముఖ్యంగా చైల్డ్ మ్యారేజ్‌లు త్రిపురలో ఎక్కువగా జరుగుతు న్నాయని, దీని నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. అనంతరం పట్టణానికి చెందిన పలు కులసంఘాల నాయ కులు, జర్నలిస్టులు, పుర ప్రముఖులు గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని ఘనంగా శాలువాలతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో భారత సురక్షా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు అశోక్ కుమార్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, భూపతి రెడ్డి, కృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు కాసిపేట లింగయ్య, గుజ్జుల రామకృష్ణారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు ముదుగంటి రవీందర్‌రెడ్డి, సింగం గంగాధర్, కాశీనాదం, సత్యప్ర కాష్, అర్జున్‌రావు, సంపూర్ణచారి, పోచమల్లు, అరుణ్‌కుమార్, బిట్టు తదితరులున్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఇంద్రసేనా రెడ్డి

నలుగురిపై అదనపు కట్నం కేసు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2: అదనంగా వరకట్నం కోసం వేధించిన సం ఘటనలో వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెర్కవేడు గ్రామానికి చెందిన భర్త వంగాల సుమన్, అత్తామామలు సుగుణ, స్వామి, బావ సునీల్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ శుక్రవారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన జ్యోతిని సుమన్ 2023లో ప్రేమ వివాహం చేసుకున్నాడన్నారు. కొంత కాలంగా ఉన్న ఊరిలో ఉపాధి లేకపోవడంతో ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌కు వలస వచ్చి ఓ గదిని అద్దెకు తీసుకొని కూలీ పనులు చేస్తున్నారని తెలిపారు. మూడు నెలలు భార్యను సరిగా చూసుకున్న భర్త సుమన్ తన తల్లిదండ్రులు, సోదరుడితో కలిసి అదనపు కట్నం కోసం వేధించడం ప్రారంభించాడు. బాధితురాలు జ్యోతి ఫిర్యాదుతో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ వివరించారు.

నంది పంప్‌హౌస్ నుంచి

గోదావరి జలాల ఎత్తిపోతలు



డెలివరీ సిస్టర్న్ ద్వారా ఎత్తిపోస్తున్న గోదావరి నీరు

ధర్మారం, ఫిబ్రవరి 2: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం లోగల కాళేశ్వరం ప్రాజెక్ట్ నంది పంప్ హౌస్ నుంచి శుక్రవారం సాయంత్రం గోదావరి జలాల ఎత్తిపోతలు ప్రారంభమయ్యాయి. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి అండర్ టన్నెల్ ద్వారా నంది పంప్ హౌస్‌లోకి నీటిని విడుదల చేశారు. అక్కడినుంచి రెండో పంపు మోటార్ ద్వారా 3150 క్యూసెక్కుల నీటిని డెలివరీ సిస్టర్న్ గుండా నంది రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నారు. నంది రిజర్వాయర్‌లో నీటి లభ్యత లేదని రిజర్వాయర్ కింద పంటలు సాగు చేసిన ధర్మారం, వెల్గటూర్ మండలాల రైతులు అధికారులకు విన్నవించారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం నంది పంప్‌హౌస్ ద్వారా రిజర్వాయర్‌లోకి నీటి తరలింపు ప్రక్రియను అధికారులు మొదలుపెట్టారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట

దళితుల ఆందోళన


ఆందోళన చేస్తున్న నాగంపేట దళితులు

గంభీరావుపేట, ఫిబ్రవరి 2: తమ భూమి తమకే ఇవ్వాలని నాగంపేటకు చెందిన దళితులు గంభీరావుపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళనకు దిగారు. 1980-96లో రెండు విడతలుగా అప్పటి ప్రభుత్వాలు సర్వే నంబరు 92/ఏలో ఇళ్ల నిర్మాణం కోసం స్థలాలను కేటాయించి పట్టాలను ఇచ్చిందన్నారు. అప్పటి నుంచి ఆ స్థలాలల్లో తాత్కాలిక గుడిసెలు వేసుకున్నామని, ఇటీవల ఇళ్లు నిర్మించుకునేందుకు తాము సిద్ధమవుతుంటే అదే గ్రామానికి చెందిన కొందరు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇదేమిటని అడిగితే వేసుకున్న గుడిసెలను తొలగించి, అక్రమ కేసులు పెడుతున్నారని వాపోయారు. భూమిని తమకే ఇచ్చే విధంగా చూడాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాగంపేటకు చెందిన బాలనర్సు, దేవేంద్ర, దేవరాజు, రాజు, రవి, శంకర్‌బాబు, శేఖర్, రాజవ్వ, లక్ష్మి, లత. లాస్య చంద్రవ్వ ఉన్నారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

వీర్నపల్లి, ఫిబ్రవరి 2:మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం రాత్రి ఆటో బోల్తా పడిన ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. వీర్నపల్లికి చెందిన కుటుంబ సభ్యులు ఆటోలో శుభకార్యానికి వెళ్లి వస్తున్నారు.

అటవీశాఖ కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారిపై అడవి పంది అడ్డుగా రావడంతో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న అబ్రహం, ప్రభలత, పుష్ప, సత్తవ్వ, నవనీత, మంజులకు గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న స్థానిక ఎస్ఐ రమేష్ ప్రమాదాన్ని గమనించి గాయపడిన వారిని వెంటనే చికిత్స కోసం అంబులెన్స్‌లో ఎల్లారెడ్డి పేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. క్షత గాత్రులను ఆసుపత్రికి తరలించిన ఎస్ఐని స్థానికులు అభినందించారు.

ఎలుగుబంటి సంచారం

చందుర్తి, ఫిబ్రవరి 2: మండలంలోని ఎనగల్‌లో ఎలుగుబంటి ప్రజల ను బెంబేలెత్తిస్తోంది. శివాలయం నుంచి మామిడిపల్లి గ్రామం వైపు వెళ్లే దారిలో కొత్తచెరువు, నక్క ఒర్రె ప్రాంతంలో రెండు రోజుల నుంచి ఎలుగు బంటి సంచరిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. శుక్రవారం ఓ రైతు చేనులో పత్తి కర్రను నరికి వేస్తుండగా ఎలుగు బంటి వచ్చింది. భయాందోళనకు గురైన రైతు పరుగెత్తి ఇంటికి చేరుకున్నాడు. ఏ వైపు నుంచి వచ్చి ఎలుగుబంటి దాడి చేస్తుందోనని రైతులు, ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించాలని, ఎలుగుబంటి నిబంధించాలని కోరుకుంటున్నారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2:మండలంలోని పదిరలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇంటింటా జ్వరంతో మంచం పట్టారు. మండల కేంద్రంతోపాటు సిరిసిల్ల, కరీంనగర్, హైదరాబాద్ పట్టణాల్లో చికిత్స పొందుతున్నారు. ఆర్థిక స్థోమత లేని పేదలు ఇంటికే పరిమితమయ్యారు. గ్రామంలో పారిశుధ్యం లోపించి దోమలు తీవ్రమయ్యాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. వైద్య అధికారులు వచ్చినా నామమాత్రపు పరీక్షలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించిగ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజున సెలవు ప్రకటించాలి

గంభీరావుపేట, ఫిబ్రవరి 2 : గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జన్మదినమైన ఫిబ్రవరి 15ను సెలవు దినంగా ప్రకటించాలని, జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని ఆల్ ఇండియా బంజార సేవ సంఘం అధ్యక్షుడు, సేవాలాల్ సోషల్ సర్వీస్ జిల్లా కన్వీనర్ అజ్మీరా భాస్కర్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. గంభీరావుపేట మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు.

తెలంగాణ రాష్ట్రంలో 13 శాతం ఉన్న గిరిజనులకు స్థలం కేటాయించాలని, సేవాలాల్ మహారాజ్ భవనాన్ని కట్టించాలని అన్నారు. గత ప్రభుత్వంలో కేవలం హైదరాబాద్‌లో బంజార భవన్ నిర్మించారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ జిల్లా కేంద్రంలో బంజార భవనాన్ని కట్టించి గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

జాతీయస్థాయి పోటీలకు కరీంనగర్ మాస్టర్ అథ్లెట్స్



జాతీయ స్థాయికి ఎంపికైన మాస్టర్ అథ్లెట్స్

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 2: హైదరాబాద్‌లోని గచ్చీబౌలి స్టేడియంలో ఈనెల 8 నుంచి 11 వరకు జరిగే జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీలకు జిల్లాకు చెందిన పలువురు మాస్టర్ అథ్లెట్స్ ఎంపికయ్యారు. డిసెంబరు 30,31 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని జిల్లా మాస్టర్ అథ్లెటిక్ అసోసియేష్ అధ్యక్ష, కార్యదర్శులు పేర్యాల రవీందర్, నీలం లక్ష్మణ్ తెలిపారు. 30 సంవత్స రాల పైబడిన విభాగంలో ఎల్ సత్య, పి ర్యూన్సీ, ఎల్ మానసిక, 35 సం వత్స రాలు పైబడిన వారి విభాగంలో టి రజిత, ఎన్ శ్రీధర్, జి వెంకటే ష్, జి స్వామి, సాయిరాం, 40 సంవత్సరాలు పైబడిన విభాగంలో ఎం రేణుక, కె శోభరాణి, ఎన్ కమల్‌సాగర్, ఎం సంపత్, 45 సంవత్సరాలు పైబడిన విభాగంలో ఎన్ పద్మ, పి రవళి, పి అమరేందర్, ఎ ప్రభాకర్, బి మల్ల య్య, పి చంద్రశేఖర్, ఎ అశోక్, 50 సంవత్సరాలు పైబడిన విభా గంలో సిహెచ్ మునిందర్, 65 పైబడిన విభాగంలో ఎండి షఫి, 80 పై బడిన విభాగంలో ఎన్ వెంకటయ్య ఎంపికయ్యారని వారు తెలిపారు.

రూ.6,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 2: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,600 పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 87 మంది రైతులు 938క్వింటాళ్ల విడి పత్తి, ఐదుగురు రైతులు ఐదు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,600, కనిష్ఠ ధర రూ.4,500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. శని,ఆదివారాలు సాధారణ సెలవు దినాలు కాగా, తిరిగి సోమవారం యార్డులో క్రయ విక్రయాలు ప్రారంభం కానున్నాయి.



క్యూలైన్లలో బారులుదీరిన భక్తులు



రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

వేములవాడ, ఫిబ్రవరి 2: దక్షిణ కాశీ వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం శుక్రవారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామి వారి ని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందుగా రాజరాజేశ్వర స్వామివారిని దర్శించు కునే ఆనవాయితీలో భాగంగా కొద్ది వారాలుగా భారీ సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలివస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం వేలాది మంది భక్తులు వేములవాడకు చేరుకున్నారు. ఆలయ కల్యాణ కట్ట లో తలనీలాలు సమర్పించి ధర్మ గుండంలో పవిత్ర స్నానాలు ఆచరించిన అనంతరం సర్వ దర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని స్వామి వారిని దర్శించుకొని తరించారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు.

శుక్రవారం సందర్భంగా గర్భాలయ ప్రవేశం నిలిపి వేసి లఘు దర్శనం అమలు చేశారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా కోడె మొక్కు చెల్లింపు కోసం గంటల కొద్దీ సమయం పట్టింది. అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయం సైతం భక్తులతో కిక్కిరిసి పోయింది. భక్తులు అమ్మ వారిని దర్శించుకొని బోనం మొక్కు చెల్లించుకున్నా రు. భక్తులకు ఇబ్బందులు ఎదురు కాకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

అలరించిన శాస్త్రీయ సంగీతం

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవ స్థానంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామివారి ఆరాధన ఉత్సవాలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. నాలుగో రోజు శుక్రవారం ఉదయం బాలం భారతి భాగవ తారిణి, సురేఖ భాగవతారిణి హరికథ గానం చేశారు. మధ్యాహ్నం సీహెచ్ రఘు నందన్ సంగీత కచేరి నిర్వహించారు.

సాయంత్రం జయప్రద రామ్మూర్తి వేణువు సోలో కచేరితో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేశారు. అనంతరం ఉన్నికృష్ణన్ శాస్త్రీయ సంగీత కచేరి అలరించింది. రాత్రి శాంకరి నృత్య బృందానికి చెందిన వై.విజయ వల్లి నృత్య ప్రదర్శన నిర్వహిం చారు. చివరగా కె.రాజా బృందం భక్త ప్రహ్లాద పౌరాణిక నాటక ప్రదర్శనతో ఆకట్టుకుంది.





యువతుల సాంస్కృతిక ప్రదర్శన, ఉన్నికృష్ణన్‌ను సన్మానిస్తున్న ఆలయ అధికారులు

లక్ష్మీ నరసింహుని సన్నిధిలో మంత్రి దామోదర రాజనర్సింహ పూజలు





ధర్మపురిలో పూజలు చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, కుటుంబ సభ్యులు, ఆలయం పక్షాన మంత్రికి ఆశీర్వచనం, శేష వస్త్ర, ప్రసాదాలు అందజేత

ధర్మపురి, ఫిబ్రవరి 2: ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ కుటుంబ సమేతంగా శుక్రవారం ఉద యం సందర్శించారు. ఆలయ సాంప్రదాయం ప్రకా రం వేదపండితులు, అర్చకులు, సిబ్బంది వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, స్థానిక వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య వారిని ఘనంగా ఆశీర్వదించారు.

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, రినోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామయ్య వారికి స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహుకరించి సత్కరించారు. యాగశాల వద్ద నిర్వ హించిన నరసింహ హోమంలో మంత్రి దామోదర రాజనర్సింహ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో స్వామి వారి నిత్య కల్యా ణంలో మంత్రి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మంత్రి కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం అందించి ఆలయం పక్షాన స్వామి శేషవస్త్ర, ప్రసాదాలు అందించి సత్కరించారు.

నరసింహుని దర్శనం ఆనందంగా ఉంది

లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం ఆనందంగా ఉం దని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. స్వామి దర్శనం అనంతరం ఆలయం ఆవరణలో ఆయన కొద్ది సేపు విలేకరులతో మాట్లాడారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి తన ఇళ వేల్పు అన్నారు. స్వామి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఆలయంలో నిర్వహించే నిత్య అన్నదానం కోసం ఆయన రూ 1,00,000 విరాళాలు అందించారు. అలాగే బ్రాహ్మణ సంఘం అభివృద్ధి కోసం ఆయన రూ 1,01,000 విరాళాలు అందించారు.

బీఆర్ఎస్ పాలనలో ప్రజల ఆకాంక్షలు నిర్వీర్యం

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

రాష్ట్రంలో తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల ఆకాం క్షలు నిర్వీర్యమయ్యాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో శుక్రవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసి న విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

బీఆర్ఎస్ పాలనలో ఏళ్ల తరబడి అనేక ఇబ్బం దులు పడ్డ ప్రజలు ఆ పాలన నుంచి విముక్తి కోసమే కాంగ్రెస్ పార్టీని గెలిపించారన్నారు. కాం గ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలకు కట్టుబడి ఉందన్నారు. త్వరలోనే ఒక్కొక్క గ్యారెంటీ పథకాన్ని అమలు చేసి ప్రజాసంక్షేమ పాలన అంది స్తుందన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య సేవల మెరుగుద లపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. విద్య, వైద్య రంగాల్లో ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటా మన్నారు. సిబ్బంది నియామకాల ప్రక్రియ అనేది అర్హులైన స్థానికులతో భర్తీ చేయడం కోసం జిల్లా యంత్రాగానికి అప్పగించే దిశగా ఆలోచిస్తున్నా మన్నారు. పలు జిల్లాల్లోని 22 నియోజకవర్గాలు కోల్ బెల్ట్ పరిధిలో ఉండగా పరిశ్రమలు మాత్రం లేవన్నారు.

సింగరేణి సీనరేజి నిధులు కేటాయిం చాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళు తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శించడం కోసం వెళితే పోలీసులను పెట్టి అడ్డుకున్నారన్నారు. తాము ఎవరిని విమర్శించడం లేదని, కేవలం ఆత్మ విమర్శ చేసుకోవాలని అంటున్నామని ఆయన తెలిపారు. ధర్మపురికి వైద్య పరంగా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన అన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వం లో ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఈ విషయంలో అడ్వకేట్ జనరల్, న్యాయవాదులు సుప్రీం కోర్టులో వాదనలు వినిపిస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

10న 'నవోదయ' ప్రవేశ పరీక్ష

చొప్పదండి, ఫిబ్రవరి 2: నవోదయ విద్యాలయం లో 9, 11 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 10న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మంగ తాయారు ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం 1,745, 11వ తరగతిలో ప్రవేశాలకు 1,144 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నార న్నారు. వీరి కోసం కరీంనగర్‌లో 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హాల్ టికెట్‌లను ఆన్ లైన్‌లో ఉంచామని, డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఏమైనా సాంకేతిక సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

గురుకుల సీవోఈ ఇంటర్ ప్రవేశ పరీక్ష రేపు

మానకొండూర్, జనవరి 2: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గురుకుల సీవోఈ ఇంట ర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష ఈ నెల 4న నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలల డీసీవో శ్రీని వాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఇంటర్మీడియట్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థు లు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఆది వారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ప్రవేశ పరీక్షకు హాజరు కావాలనికోరారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

ధర్మారం, ఫిబ్రవరి 2: ధర్మారం మండలం ఖిలావన పర్తి గ్రామానికి చెందిన భూతగడ్డల వసంత (29) అనే వివాహిత గురువారం సాయంత్రం కడుపునొప్పి బాధ భరించలేక పురుగుల మందు ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. మూ డేళ్ల నుంచి ఆమె కడుపు నొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో గురువారం తీవ్రంగా కడుపునొప్పి రావడం తో బాధ భరించలేక సాయంత్రం పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలుకు వైశాలి (10), గునజ(6)కు మార్తెలున్నారు. శుక్రవారం మృతు రాలి సోదరుడు నూనె మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సత్య నారాయణ తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ ముగ్గురికి గాయాలు

మానకొండూర్, ఫిబ్రవరి 2: మండలంలోని పోచం పల్లి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. కరీంనగర్‌లోని మంకమ్మతోట కుచెందిన ఎదులాపురం జగన్(58), మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన పొట్టాల లక్ష్మయ్య(50), పని నిమిత్తం పోచంపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తున్నారు. పచ్చునూర్‌కు చెందిన ఎరవెల్లి కు మార్(40) కరీంనగర్ నుంచి పచ్చునూర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రి కి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 2: కరీంనగర్ కశ్మీర్‌గడ్డ ప్రాంతంలో గత నెల 30న మంటలు అంటుకుని కాలిన గాయాలతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొం దుతున్న ఎండీ ఖాసీం(55) శుక్రవారం మృతి చెందాడని రెండో టౌన్ సీఐ ఓ వెంకటేష్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం... ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఖాసీం జనవరి 30న ఇంటి వద్ద ఉన్న సమయంలో అతని బట్టలపై శానిటైజర్ బాటిల్ పడింది. కొద్దిసేపటి తరు వాత ఖాసీం బయటకు వచ్చి బీడీ తాగేందుకు అగ్గి పుల్లను వెలిగించగానే అతనికి ఒంటిపైన బట్టలకు మం టలు అంటుకున్నాయి. స్థానికులు మంటలను ఆర్పివేసి ప్రభుత్వ ఆసుపత్రికి, ఆ తరువాత ఎంజీఎంకు తరలిం చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి కొడుకు మహ్మద్ ఫహద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలి పారు. కాగా ఖాసీం కొడుకుపై స్థానిక నాయకులు అక్రమ కేసు పెట్టించి జైలుకు పంపించటంతో మన స్తాపంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని సోషల్ మీడియా లో ప్రచారం జరుగుతున్నది.

రైలు కింద పడి వ్యక్తి మృతి

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 2: జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి ఎక్స్‌ప్రెస్ రైల్లో నుంచి ప్రమాదవశాత్తు కింద పడి శుక్రవారం అక్కడికి అక్కడే మృత్యువాత పడ్డాడు. ఓడిశా రాష్ట్రం బలంగీర్ జిల్లా భారుపాలి గ్రామానికి చెం దిన గోపాల్ ఛాత్రీయా (43) తన కుమారుడు, కుమార్తెతో కలిసి ఎక్స్‌ప్రెస్ రైల్లో ఎక్కి జనరల్ కోచ్‌లో సికింద్రాబాద్‌కు వస్తున్నాడు. మార్గ మధ్యలో బిజిగిరిషరీఫ్ రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవ శాత్తు కిందపడి మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య ద్రౌపతి, ఇద్దరు కుమా రులు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



సాగర్

ముస్తాబాద్, ఫిబ్రవరి 2: మండలంలోని మోర్రా యిపల్లె గ్రామానికి చెందిన గూడ సాగర్ (18) శుక్ర వారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాగర్ ఇంటర్ పూర్తి చేసి ఢిల్లీలో కంప్యూటర్‌పై శిక్షణ తీసుకొని వచ్చాడు. తిరిగి ఢిల్లీ వెళ్లే క్రమంలో ఉద్యోగం వస్తాదో? రాదో?నని మనస్తాపం చెందాడు. గ్రామానికి సమీపంలోని కోళ్ల ఫారంలోకి వెళ్లి ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లాత్ స్టోర్‌లో అగ్ని ప్రమాదం

రూ.3 లక్షల ఆస్తి నష్టం

కొడిమ్యాల, ఫిబ్రవరి 2: మండల కేంద్రంలోని శ్రీ సుమంగళి క్లాత్ స్టోర్‌లో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం జరి గినట్లు బాధితుడు బుర్ర సంతోష్ పోలీ సులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రమాదంలో దుకాణంలో ఉన్న పట్టు చీరెల తో పాటు ఫర్నిచర్ కాలిపోయినట్లు బాధితు డు తెలిపాడు. ప్రమాదం ఎలా జరిగింది అనేది తెలియటం లేదు. సంఘటన స్థలా న్ని హెడ్ కానిస్టేబుల్ అర్జరాజు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ వి. రవీందర్ పరిశీలించారు.



లోక్‌సభ ఎన్నికల్లో ప్రజా విశ్వాసాన్ని చూరగొనాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రావణి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రావణి

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 2: కేంద్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమార్థం ప్రవేశ పెడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రజా విశ్వాసాన్ని చూరగొనాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి పిలుపునిచ్చారు. గావ్ చలో, బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో పట్టణ ప్రవాసీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ గావ్ చలో, బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామం, వార్డులో ఈ ప్రవాసీ కార్యకర్త లను నియమిస్తామన్నారు. ఈ ప్రవాసీ కార్యకర్తలు వార్డు, గ్రామంలో ప్రతి వీధిలోకి వెళ్లి వార్డు స్థితిగతులు, బూత్ కమిటీల పనితీరును పరిశీలించి, ఆయా వార్డుల్లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను కలవడం, కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించడం జరుగుతుందన్నారు. బూత్ లెవల్ నుంచి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల మద్దతును కూడగట్టి, ప్రజా విశ్వాసాన్ని ప్రభుత్వం చూరగొనాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుంది

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు కొమిరెడ్డి కరంచంద్

మెట్‌పల్లి, జనవరి, 2 : రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో నెరవేరుస్తుందని పార్టీ సీనియర్ నాయకుడు కొమిరెడ్డి కరంచంద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పునప్రారంభం కోసం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో సిఫారసు కమిటీ వేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గత దశాబ్ద కాలంగా మూతపడ్డ చక్కెర కర్మాగారం తెరిపించడానికి స్వర్గీయ ఫ్లోర్ లీడర్, మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు నేతృత్వంలో నిరసనలు రాస్తారోకోలు, ధర్నాలు, పాదయాత్రలు, దీక్షలు చేపట్టిన సమయంలో అప్పటి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సీఎం రేవంత్‌రెడ్డి దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారన్నారు. దీక్ష సమయంలో ఇచ్చిన హామీను నెరవేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్యంతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలి

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బూర్ల చంద్రశేఖర్

మెట్‌పల్లి, ఫ్రిబవరి, 2 : విద్యార్థులు కష్టంతో కాకుండా లక్ష్యంతో చదువుకొని మంచి ఫలితాలను సాధించాలని మెట్‌పల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బూర్ల చంద్రశేఖర్ అన్నారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా శుక్ర వారం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, బ్యాడ్జీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు గురికాకుండా సమీపంలో ఉన్న వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని పలు సూచనలు చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ వారి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో ఉత్సవంగా పాల్గొని విజయవంతం చేయాలని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి వేంకయ్య, అధ్యాపక బృందం బిల్ల రాజేందర్, గట్టయ్య, అంజయ్య, మధుబాబు, గణేష్, బాబు, లక్ష్మీనారాయణ, లింగం, భూలక్ష్మి, వాలంటీర్లు పాల్గొన్నారు.

'హద్దులు నిర్ణయించాలి'

కోరుట్ల, ఫిబ్రవరి 2 : పట్టణం శివారులోని జాతీయ రహదారిని అనుకొని ఉన్న సర్వే నంబర్ 1311ను పరిరక్షించి హద్దులు నిర్ణయించాలని మున్సిపల్ మాజీ కౌన్సిలర్ హమీద్ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజేశ్వర్‌ను హమీద్ వినత్రి పత్రం అందించారు. ఈ సందర్భంగా హమీద్ మాట్లాడారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 1311గలది కొందరు రియల్ ఏస్టేట్ వ్యాపారులు కబ్జా చేస్తున్నారని, ఆ స్థలం పరిరక్షించడానికి హద్దులను నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి

ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 2: క్రీడాకారుల కోసం అన్ని మౌలిక సదుపాయాల ఏర్పాటుకు తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణానికి చెందిన అద్వైత్, అభినవ్ సాయి, ప్రీతం స్పీడ్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయ స్థాయి స్పీడ్ స్కేటింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్, బ్రాంజ్ మెడల్స్ సాధించగా ఎమ్మెల్యే అభినందించారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలని, విద్య ఎంత ముఖ్యమో చదువు అంతే ముఖ్యమని అన్నారు.

●జగిత్యాల పావని కంటి ఆస్పత్రిలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 19 మంది నిరుపేదలకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కంటి ఆపరేషన్లు చేసి ఉచితంగా కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. డాక్టర్ విజయ్, నాయకులు సమిండ్ల శ్రీనివాస్, పిట్ట ధర్మరాజు పాల్గొన్నారు.

●పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇప్పించాలని కోరుతూ జగిత్యాల పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పని చేస్తున్న ఆర్పీలు ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఎమ్మెల్యే తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బోరు వేశారు.. మోటారు మరిచారు ?

●పశువైద్యశాలలో నీటి వసతి లేక ఇక్కట్లు

●పట్టించుకోని అధికారులు

కొడిమ్యాల, ఫిబ్రవరి 2 : మండల కేంద్రంలోని పశువుల ఆసుపత్రిలో నీటి వసతిలేక పశువుల యజమానులు ఆందోళన చెందుతున్నారు. సుమారు ఏడాదిన్నర క్రితం ఆసుపత్రికి నీటి వసతి కలిపించాలన్న ఉద్దేశంతో బోరు వేశారు. కానీ ఇప్పటికి మోటారు మాత్రం అమర్చలేదు. దీంతో వేసిన బోరు నిరుపయోగంగా మారింది. ఆసుపత్రి నిర్మించినప్పటి నుంచి సుమారు పది సంవత్సరాల నుంచి ఆసుపత్రికి నీటి వసతిని కలిపించాలని పలు మార్లు ఉన్నతాధికారులకు, మండల, గ్రామ పంచాయతీ సమావేశాల్లో గ్రామ నాయకులు, పశువుల యజమానులు వినతి చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోవటం లేదన్న ఆరోపణలున్నాయి. సుమారు ఏడాదిన్నర క్రితం ఆసుపత్రి ఎదుట బోరు వేశారు. మోటారు బిగించక పోవటంతో నీటి వసతి కలుగుతుందని ఆశించిన పశువుల యజమానులకు నిరాశే మిగిలింది. ఇతర ప్రాంతం నుంచి నీటిని తీసకవస్తున్నారు. ప్రహరీ గోడ లేక పోవటంతో బహిర్భూమిగా ఆసుపత్రి పరిసరాలను వాడుకోవటంతో ఆ ప్రాంతమంతా దుర్గంధ భరితంగా తయారైందని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక నాయకులు, అధికారులు పట్టించుకొని పశువుల ఆసుపత్రి ఎదుట వేసిన బోరుకు మోటారు అమర్చాలని కొడిమ్యాల పశువైద్యాధికారి ప్రసాద్ కోరుతున్నారు. అలాగే ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలన్నారు.

ఘనంగా గద్దర్ జయంతి వేడుకలు

కథలాపూర్, ఫిబ్రవరి 2 : ప్రజాయుద్ధ నౌక గద్దర్ 77వ జయంతి వేడుకలు శుక్రవారం మండల కేంద్రంలో ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గద్దర్ తన ఆటా, పాటలతో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల్లో చైతన్యం నింపారని పేర్కొన్నారు. విప్లవ భావాలతో అగ్రవర్ణాల దోపిడిపై పోరాటాలు చేసిన ఘనత గద్దర్‌కు దక్కిందని అన్నారు. గద్దర్ చిత్రపటంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలె నీలకంఠం, కడారి స్వామి, శ్రీధర్, రాజన్న, పాల్, బోదాసు రెడ్డి ఉన్నారు.

నేడు పట్టణంలో చెన్నూర్ ఎమ్మెల్యే పర్యటన

కోరుట్ల, ఫిబ్రవరి 2 : పట్టణంలోని ఈ నెల 3వ తేదిన చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పర్యటించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని జువ్వాడి భవనంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో నియోజకవర్గ ప్రజలు సమస్యలు తెలుపడానికి ఫోన్ ఏర్పాటు చేయడంతో దానిని ఆవిష్కరించేందుకు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హాజరు కానున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మధ్యాహ్నం జువ్వాడి భవనంలో జరు గు కార్యక్రమంలో వివేక్ పాల్గొనున్నట్లు వారు తెలిపారు.

గ్రామాల్లో బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేకాధికారులు



దావన్‌పెల్లి ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఏఈ ప్రసాద్



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రత్యేక అధికారులు

రాయికల్, ఫిబ్రవరి 2: సర్పంచుల పదవీ కాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించింది. ఈ మేరకు శుక్రవారం అన్ని గ్రామాల్లో ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని మైతాపూర్, ధర్మాజీపేట గ్రామాలకు ప్రత్యేకాధికారిగా ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఈఈ భాస్కర్ వ్యవహరించనున్నారు. ఒడ్డెలింగాపూర్, వస్తాపూర్, దావన్‌పెల్లి గ్రామాలకు పంచాయతీ రాజ్ శాఖ ఏఈ సీవీ ప్రసాద్, మూటపల్లి, ఒడ్డెర కాలనీ గ్రామాలకు ఇరిగేషన్ ఏఈఈ ధనుంజయ్, ఇటిక్యాల, సింగరావుపేట, శ్రీరాంనగర్ గ్రామాలకు ఎంపీడీవో సంతోష్ కుమార్, కిష్టంపేట, బోర్నపెల్లి, ఆల్యానాయక్ తండా గ్రామాలకు నాయబ్ తహసీల్దార్ జె.గణేష్‌లు ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు చేపట్టారు. అలాగే రామాజీపేటకు డీఈవో జగన్మోహన్ రెడ్డి, అయోధ్య, చింతలూరు గ్రామాలకు ఎస్సారెస్పీ ఏఈఈ కె.రాజేష్, తాట్లవాయి, మంక్యానాయక్ తండా, కుర్మపల్లి, కైరిగూడెం గ్రామాలకు ఎంపీవో సుష్మా ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు స్వీకరించారు. కట్కాపూర్, జగన్నాథ్‌పూర్, గ్రామాలకు ఎంఈవో గంగాధర్, అల్లీపూర్, ఆలూరు, రామారావుపల్లి గ్రామాలకు రాయికల్ తహసీల్దార్ ఎంఏ ఖయ్యూం, కుమ్మరిపల్లి, చెర్లకొండాపూర్ గ్రామాకలు ఆర్ అండ్ బీఏఈ మధు, వీరాపూర్, ఉప్పుమడుగు గ్రామాలకు ఏవో ముక్తేశ్వర్, భూపతిపూర్ గ్రామానికి జిల్లా ఉపాధి కల్పనాధి కారి సత్యమ్మ, కొత్తపేట, రాజనగర్ గ్రామాలకు ఇరిగేషన్ ఏఈఈ వినయ్ ప్రత్యేకాధికారులుగా నియమించబడగా బాధ్యతలు స్వీకరించారు.

పెగడపల్లి : గ్రామ పంచాయతీలలో ప్రత్యేకాధికారులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సర్పంచుల పదవీకాలం గురువారంతో ముగియడంతో ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించగా శుక్రవారం ఆయా గ్రామ పంచాయతీలలో ప్రత్యేకాధికారులు ఆసీనులై బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమాలలో ఎంపీటీసీలు, పదవీకాలం పూర్తి చేసుకున్న పంచాయతీ పాలకవర్గాలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మల్యాల: సర్పంచ్‌ల పదవికాలం గురువారంతో ముగియడంతో శుక్రవారం గ్రామాల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు. మల్యాలలో జిల్లా వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్, ముత్యంపేట, మ్యాడంపల్లిలో ఎంపీడీవో వెంకటేశం, తాటిపల్లి, బల్వంతాపూర్, గొర్రెగుండంలో ఎంపీవో వాసవి, పోతారం, నూకపల్లిలో ఏఈ పీఆర్ జ్ఞానేశ్వర్, రామన్నపేటలో తహసీల్దార్ మునీందర్, తక్కళ్లపల్లి, రాజారంలో ఎంఈవో అయిత శ్రీనివాస్, రాంపూర్, ఓబులాపూర్‌లో నాయబ్ తహసీల్దార్ నీతా, లంబాడిపల్లి, సర్వాపూర్‌లో మండల వ్యవసాయ అదికారి కె.చంద్రదీపక్, మానాల, గొల్లపల్లిలో ఏఈ పీఆర్ ఇబ్రహీం మునావర్, మద్దుట్ల, గుడిపేటలో పశువైద్యధికారి రాజ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు.

సారంగాపూర్ : సర్పంచ్‌ల పదవికాలం ముగియడంతో ప్రభుత్వం గ్రామా పంచాయితీ బాధ్యతలను ప్రత్యేక అధికారులను నియమించింది. దీంతో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు శుక్రవారం మండలంలోని గ్రామ పంచాయతీల్లో అధికారులు తమకు కేటాయించిన గ్రామాల్లో బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో రాజేందర్, వ్యవసాయ అధికారి తిరుపతి నాయక్, డిప్యూటి తహసీల్దార్, లాస్య, ఆర్ఐ బాస్కర్‌రావు, నాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని 15 గ్రామాలలో ప్రత్యేక అధికారులు బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. పలువురు గ్రేడ్‌వన్ అధికారులకు గ్రామ పంచాయతీలకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ గురువారం రాత్రి జిల్లా స్థాయి అధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యతలను స్వీకరించారు. కోరుట్ల తహసీల్దార్ కిషన్‌ను మోహన్‌రావుపేట, చిన్నమెట్‌పల్లి గ్రామాల ప్రత్యేక అధికారిగా నియమించారు. అయిలాపూర్, ధర్మారం గ్రామాల ప్రత్యేక అధికారిగా ఎంపీవో నీరజ, పైడిమడుగు గ్రామ ప్రత్యేక అధికారిగా ఆర్‌అండ్‌బీ ఎఈ శ్రీనివాస్, యూసుఫ్‌నగర్ గ్రామ ప్రత్యేక అధికారిగా మండల విద్యాధికారి నరేశం, మాదాపూర్, తిమ్మయ్యపల్లి గ్రామాల ప్రత్యేక అధికారిగా మండల పశువైద్య అధికారిగా డాక్టర్ దీరజ్, జోగినిపల్లి, వెంకటాపూర్ గ్రామాల ప్రత్యేక అధికారిగా మండల వ్యవసాయ అధికారిణీ నాగమణీ, నాగులపేట, సంగెం గ్రామాలకు డిప్యూటీ తహసీల్దార్ జగదీశ్వర్, గుమ్లాపూర్ గ్రామ ప్రత్యేక అధికారిగా ఆర్‌డబ్ల్యూఎఈ శ్రీనివాస్, కల్లూర్, సర్ప రాజుపూర్ గ్రామాల ప్రత్యేక అధికారిగా పంచాయతీ రాజు మండల ఎఈ ఆదిత్య ప్రకాష్‌లను నియమించంగా వారు బాధ్యతను స్వీకరించారు.

మెట్‌పల్లి రూరల్ : పంచాయతీల్లో సర్పంచుల పదవీ కాలం పూర్తవడంతో ప్రత్యేక అధికారులను నియమించింది. శుక్రవారం మండలంలోని కోండ్రికర్లలో బాధ్యతలు స్వీకరించిన ఆర్‌అండ్‌బీ ఏఈ వేణును గ్రామంలోని నాయకులు గడ్డం రాజారెడ్డి, మెండే రమేష్, బద్దం రాజారెడ్డి శాలువతో సన్మానించి ఆహ్వానించారు. 23 గ్రామ పంచాయతీలలో ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీవో భీమేష్‌రెడ్డి తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో పాలనపై ముందుకు సాగేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారన్నారు. వీరు పల్లెల్లో పారిశుధ్య పనులు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా వంటి నిత్యం ప్రజలకు అవసరమయ్యే పనులను నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఇబ్రహీంపట్నం, గోధుర్, తిమ్మాపూర్, యామపూర్, డబ్బ, కోమటికొండపూర్ గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం గ్రామ పంచాయితీ కార్యలయలలో ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. వర్షకొండ ప్రత్యేకధికారిగా తహసీల్దార్ ప్రసాద్, కోమటికొండపూర్ ప్రత్యేకాధికారిగా ఎంపీడీవో కట్కం ప్రభు, వేముల కుర్తిలో ఎంపీవో కృపకార్‌లతో పాటు ఆయా గ్రామాల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారులను ఆయా గ్రామాల నాయకులు శాలువాతో సత్కారించారు.

జగిత్యాలరూరల్: సర్పంచుల పదవీకాలం ముగియడంతో వారి స్థానంలో ప్రభుత్వం నూతనంగా నియమించిన ప్రత్యేకాధికారులు శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో ప్రత్యేకాధికా రులు వారికి కేటాయించిన స్థానాల్లో బాధ్యతలను చేపట్టారు. ఈసందర్భంగా వారికి గ్రామపంచాయితీ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు.

గొల్లపల్లి: మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచులు ప్రత్యేకాధికారులకు బాధ్యతలు అప్పగించారు. ప్రత్యేకాధికారులుగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల సంపూర్ణ అభివృద్ధికి, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

●మండలంలోని దట్నూర్, తిర్మలాపూర్ గ్రామాలకు ఆర్ అండ్ బీ ఏఈ ఎల్.ఆదిత్య, రాపెల్లి, వెంగళాపూర్ గ్రామాలకు పంచాయతీ రాజ్ ఏఈ కె.రాహుల్, బిబిరాజ్‌పల్లి, దమ్మన్నపేట, నందిపల్లి గ్రామాలకు పంచాయతీ రాజ్ ఏఈ ఆర్.ప్రభాకర్ రావు ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు స్వీకరించారు. అలాగే లక్ష్మీపూర్, శంకరావుపేట గ్రామాలకు పంచాయతీ రాజ్ ఏఈ లక్ష్మీప్రసన్న, అబ్బాపూర్, అగ్గిమల్ల గ్రామాలకు ఇరిగేషన్ ఏఈఈ సీహెచ్ హరీష్, చిల్వాకోడూర్, రంగదాముని పల్లి గ్రామాలకు ఏవో బి.కరుణలు ప్రత్యేకాధికారులుగా వ్యవహరించనున్నారు.

గొల్లపల్లి మేజర్ పంచాయతీకి బీసీ వెల్ఫేర్ అధికారి సాయిబాబా, బొంకూర్, చెందోళి గ్రా మాలకు ఏఈవో బి.జమునా దేవి, గంగాదేవునిపల్లి, గుంజపడుగు, రాఘ వపట్నం గ్రామాలకు ఎంపీడీవో నవీన్ కుమార్, గోవిందుపల్లి, వెన్గుమట్ల గ్రామాలకు నాయబ్ తహసీల్దార్ తిరుపతి, ఇబ్రహీంనగర్, ఇస్రాజ్‌పల్లి గ్రామాలకు తహసీల్దార్ ఆరిఫొద్దీన్, ఆత్మకూర్, లొత్తునూర్ గ్రామాలకు వెటర్నరీ వైద్యుడు రవీందర్ ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు స్వీకరించారు.

పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఫిబ్రవరి 2: సర్వాయి పాపన్నగౌడ్ ఆశ య సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని చింతామణి చెరువు వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పో రాట యోధుడు సర్వాయ్ పాపన్నగౌడ్ నూతన వి గ్రహాన్ని అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శుక్రవారం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వాయ్ పాపన్నగౌడ్ బహుజన రాజ్యా ధికారం కోసం పోరాటం చేసిన యోధుడన్నారు. అలాగే పాపన్నగౌడ్ అం దించిన సేవలను ఆయ న కొనియాడారు. విగ్ర హం ఏర్పాటులో ప్రత్యేక చొరవ తీసుకున్న గౌడ సంఘం సభ్యులను ఆయన అభినందించారు. చివరగా ప్రభుత్వ విప్ అడ్లూరి మం డలంలోని శాలపల్లె గ్రామానికి వెళ్లి అసెంబ్లీ ఎన్నికల్లో తాను విజయం సాధించాలని మొక్కుకున్నల సెట్టి నందయ్య స్వామి ఇంటికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ధర్మపురి, బుగ్గారం జడ్పీటీసీలు బత్తిని అరుణ, బాదినేని రాజేందర్, టీపీసీసీ సభ్యులు సంగ నభట్ల దినేష్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ గొల్లపల్లి చంద్రశే ఖర్‌గౌడ్, మండల శాఖ అధ్యక్షులు పెరుమాండ్ల ఎల్లాగౌడ్, గౌడ సంఘం నాయకులు సుదవేని నర్సాగౌడ్, రాంచందర్‌గౌడ్, నర్సాగౌడ్, రాము లుగౌడ్, కాంగ్రెస్ నాయకులు సింహరాజు ప్రసాద్, వేముల రాజేష్, కుంట సుధాకర్, సుముఖ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం కోసం సర్వే

కథలాపూర్, ఫిబ్రవరి 2 : మండలంలోని వేమువాడ రోడ్డు వెంట ఉన్న కలి కోట నుంచి పోతారం లొంకరామన్న ఆలయం దాకా రోడ్డుకు నిధులు కేటాయించాలని ఎంపీటీసీ పులి శిరీషహరిప్రసాద్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించిన నేపథ్యంలో ఇంజినీర్లు సర్వే నిర్వహించారు. ఏఈ ఆదిత్య రోడ్డు వెంట అవసరమైన కల్వర్టులు, బీటీ రోడ్డు నిర్మాణం కోసం శుక్రవారం రు. 4.90 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఈ ఎస్టిమేట్లను ఎమ్మెల్యేకు అందించి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు ఎంపీటీసీ తెలిపారు.

జేఎన్‌టీయూ విద్యార్థికి నివాళులు

కొడిమ్యాల, ఫిబ్రవరి 2 : మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూలో ట్రిపు ల్‌ఈ ఫైనల్ ఈయర్ చదువుతున్న విద్యార్థి టి. సూర్యతేజ వరంగల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా శుక్రవారం నాచుపల్లి జేఎన్‌టీ యూలో ప్రిన్సిపాల్ కామాక్షిప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులు నివాళులు అర్పించారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయకుంటే పోరాటం

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 2: అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా సాగునీటిని విడుదల చేయకుంటే రైతుల తరపున పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని అనంతగిరిలో శుక్రవారం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీ ద్వారా సూర్యపేట, జనుగామ, హుస్నాబాద్ ప్రాంతాలకు నీటిని తీసుకెళ్తున్నారని, అన్నపూర్ణ రిజర్వాయర్‌కు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే సత్యనారాయణ ఆర్భాటంగా ప్రాజెక్టును పరిశీలించారని, నీటి విడుదలను ఎందుకు పట్టించుకోవడం లేదని అన్నారు. రాజకీయ బేషజాలకు వెళ్లకుండా రైతులకు అండగా నిలవాలన్నారు. సాగునీరు లేక రైతులు వలస వెళ్లేవారని, బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీరు అందించడంతో స్వగ్రామాలకు వచ్చారని అన్నారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే పాతరోజులు వచ్చేలా ఉన్నాయన్నారు. రైతులపై ప్రేమ ఉంటే ప్రభుత్వం వెంటనే స్పందించి సాగునీటిని విడుదల చేయాలన్నారు. జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, సెస్‌డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీలు గొట్టెపర్తి పర్శరాం, పట్నం అశ్విని‌శ్రీనివాస్, సావనపెల్లి వనజఅనీల్‌కుమార్, పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ బాలగౌడ్, మాజీ ఉపసర్పంచ్ బాలకిషన్, ఆంజనేయులు, నాయకులు రాజారాం, మీసరగండ్ల అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఊరూరా పండుగలా ఉపాధిహామీ దినోత్సవం

పెగడపల్లి, ఫిబ్రవరి 2 : జాతీయ ఉపాధిహామీ పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం పెగడపల్లి మండలంలోని ఊరూరా కూలీలు పండగలా జరుపుకున్నారు. ఉపాధిహామీ పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించు కుని మండలంలోని పలు గ్రామాలలో పని ప్రదేశాలలోనే గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచులు, ఉపాధిహామీ అధికారులతో కలసి కేక్ కట్ చేసి ఒకరికొకరు స్వీట్లు తినిపించుకు న్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా తమకు ఉన్న ఊర్లోనే పని లబిస్తుందన్నారు.

గావ్ చలో-బస్తీ చలో విజయవంతం చేయాలి

బీజేపీ పట్టణాధ్యక్షుడు బోడ్ల రమేష్



మెట్‌పల్లిలోని సమావేశంలో మాట్లాడుతున్న బొడ్ల రమేష్

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 2 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశంలో సాధించిన విజయాలను గావ్ చలో-బస్తీ చేలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రవాసి కార్యకర్తలు బూత్ స్థాయిలో ప్రచారం చేపట్టాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బోడ్ల రమేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వాసవి గార్డెన్‌లో బూత్ స్థాయి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం మహిళా సాధికారిత అంతర్గత భావ్య భద్రత సంస్కృతి పునర్ధురణ, విదేశాల్లో భారత దేశ గౌరవాన్ని పెంచి అన్ని రంగాల్లో దేశాన్ని బీజేపీ ప్రభుత్వంలో కేంద్రంలో ప్రధాన నరేంద్ర మోదీ నేతృత్వంలో అభివృద్ధి చేశారన్నారు. గత పది సంవత్సరాల్లో బీజేపీ ప్రభుత్వం పాలనలో ప్రపంచ దేశాల్లో భారతదేశ ఖ్యాతిని పెంచిన గొప్ప నాయకుడని కొనియాడారు. పీఎం నరేంద్రమోదీ నేతృత్వంలో సాధించిన విజయాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధిని బూత్ స్థాయి కమిటీ సభ్యులు ప్రతి ఇంటికి వివరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, ధోనికేల నవీన్, చెట్లపల్లి మీనా, డాక్టర్ రఘు, కుడుకల రఘు, సుంకేటి విజయ్, రమేష్‌యాదవ్, తోకల గంగనర్సయ్య, కొయ్యల లక్ష్మణ్, కలికోట శ్రీకాంత్, మద్దెల లావణ్య, పుల్ల సౌజన్య, సోమిరెడ్డి సునీత, వరలక్ష్మి, తోకల సత్యనారాయణ, సుంకే అశోక్, జుంగుల అనిల్‌గౌడ్, కాదస్తు శ్రీనివాస్, రాజయ్య, విజయ్, రాజిరెడ్డి, సాయిప్రసాద్, భాస్కర్, తిరుమల్ పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని శ్రీ కర్నె అక్కపెల్లి కళ్యాణ మండపంలో బీజేపీ ఆధ్వర్యంలో చలో గర్ చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవా రం వర్క్ షాపు నిర్వహించారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ కార్యకర్తలు అందరు పాల్గొని బూత్ స్థాయిలో ఉన్న ప్రముఖులు, రైతులు, యువకులను కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరించాలన్నారు. మరొక సారి కేంద్రంలో నరేంద్ర మోదీని అధికారంలోకి తీసుక రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ధర్మపురి పట్టణ అధ్యక్షులు బెజ్జారపు లవణ్, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, అసెంబ్లీ కో కన్వీనర్ బండారి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి తిరుమన్‌దాసు సత్యనారాయణ, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, మూర్తి, మల్లేష్, దివిటి శ్రీధర్, మండలోజు సూరజ్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కొడిమ్యాల, ఫిబ్రవరి 2 : మండలంలోని రామకిష్టాపూర్ గ్రామ తాజా మాజీ సర్పంచు గుంటి లక్ష్మీదేవవ్వ భర్త గుంటి భూమయ్య, మండల కేంద్రానికి చెందిన చిర్ర చంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పరామర్శించారు. మృతికి గల కారణాలను మృతుల కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు అవినాష్‌రెడ్డి సతీమణి ద్విచక్ర వాహనంపై నుంచి పడి ప్రమాదానికి గురికాగా ఆమెను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట సర్పంచుల ఫోరం మండల తాజా మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, కొడిమ్యాల, తిర్మలాపూర్ సింగిల్ విండోల చైర్మనులు రాజనర్సింగరావు, రాజేందర్, ఉపాధ్యక్షుడు ప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకులు స్వామి, మహేష్, దేవయ్య, రాజ్‌కుమార్, గంగరాజం, సంతోష్, రాకేష్, అరుణ్, శంకర్, అనిల్, తాజా మాజీ సర్పంచులు మల్లేశం, మహిపాల్ ఉన్నారు.

అల్పహారానికి విరాళం

కొడిమ్యాల, ఫిబ్రవరి 2 : మండలంలోని చెప్యాల ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు సా యంత్రం స్టడీ అవర్‌లో అల్పాహారం అందించడానికి హైదరాబాదు నుంచి వెళ్లి అమెరికాలో స్థిరపడిన సొదరి భాస్కర్, ఝాన్సీ 5వేల రూపాయలను, తిర్మాలాపూర్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు 2వేల రూపాయలను విరాళంగా ఆన్‌లైన్ ద్వారా అందించినట్లు ప్రధానోపాధ్యాయులు ఎం. వెంకటస్వామి, జ్యోత్స్నాదేవి తెలిపారు. దాతలకు ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యా యులు, విద్యార్థులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల వీడ్కోలు హంగామా

బీర్‌పూర్, ఫిబ్రవరి 2: బీర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థుల వీడ్కోలు పార్టీ ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థిని విద్యార్థులు నృత్యాలు చేసి పలువురిని ఆకట్టుకొని అలరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ ఆపీసర్ బి. నా రాయణ, కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఎంపీపీ మసర్తి రమేష్, లెక్చరర్‌లు, నాన్ టీచింగ్ లెక్చరర్‌లు విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానంతో సర్పంచ్‌కు విడ్కోలు

బీర్‌పూర్, ఫిబ్రవరి 2: మండలంలోని మంగేళ గ్రామంలో శుక్రవారం గ్రామ పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో విడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గడిచిన ఐదు సంవత్సరాల పాటుగా సేవలందించి సర్పంచ్, ఉప సర్పంచ్, వాడు సభ్యుల పదవి కాలం ముగిసిన సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బంది అందరు కలిసి పదవి కాలం ముగించకున్న సర్పంచ్ చుంచు శారధ నరేంధర్‌లతో పాటు ఉప సర్పంచ్, వాడు సభ్యులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి విడ్కోలునిచ్చారు. కార్యదర్శి రవి, కారోబార్ లక్ష్మన్, అంగన్‌వాడీ టీచర్లు సుమలత, విజయ లక్ష్మీ, పమీల తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ పాలకవర్గానికి సన్మానం

భీమారం, ఫిబ్రవరి 2: పదవీ కాలం పూర్తయిన భీమారం గ్రామ పంచాయతీ పాలకవర్గానికి శుక్రవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఐదు సంవత్సరాల పదవీ కాలంలో చేపట్టిన పనులను, సహాయ సహకారాలను గ్రామస్థులు కొనియాడారు. ఈ సందర్భంగా పదవీ కాలం పూర్తి చేసుకున్న మాజీ సర్పంచ్ అరుణ, మాజీ ఉప సర్పంచ్ బస్వరాజుల రాజు, మాజీ వార్డు సభ్యులు నరేష్, సంజీవ్, అశోక్, స్వామి, కవిత, జమునాబీ, లలిత, సుష్మిత, గంగవ్వలను శాలువాలు, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, ఏఎన్‌ఎం సుశీల, ఆశ వర్కర్ సంధ్య, అంగన్ వాడీలు మంజుల, రాణి, శ్యామల, స్వరూప, అశోక్, లావణ్య, రజిత, లావణ్య, కారోబార్ వనిత, సిబ్బంది రాజం, చిలుకయ్య గంగనర్సయ్య, చెక్కపెల్లి రఘు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపు పట్ల హర్షం

కథలాపూర్, ఫిబ్రవరి 2 : మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామి పథకం కింద సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రు. 65 లక్షలు కేటాయించడం హర్షణీయమని మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, ఆకుల నర్సయ్య ఉన్నారు.